కాసులు కురిపిస్తున్న దిబ్బగుల్లలు

- గోస్తనీ నదికి సరదాగా వెళ్లి సేకరిస్తున్న స్థానికులు
- 70 కిలోల బస్తా రూ.500కు కొంటున్న వ్యాపారులు



రవాణాకు బస్తాలలో నింపిన దిబ్బగుల్లలు



మూలకుద్దు వద్ద గోస్తనీ నది నుంచి దిబ్బగుల్లలు సేకరిస్తున్న స్థానికులు

తగరపువలస : భీమిలి మండలం మూలకుద్దు, చిప్పాడ, పెదనాగమయ్యపాలెం వాసులకు గోస్తనీ నది, ఉప్పుటేరులో లభించే దిబ్బగుల్లలు ఉపాధి కల్పిస్తున్నాయి.

వర్షాల ప్రారంభంతో నదీ తీరంలో విరివిగా ఈ గుల్లలు లభిస్తుంటాయి. నీటిలో ఇసుక కింద కేవలం అడుగు లోతున తేలికగా చిక్కుతాయి. వీటి మాంసాన్ని కూడా స్థానికులు ఇష్టంగా తింటారు. ప్రస్తుతం ఈ గుల్లలను భూములకు ఎరువుగా, చేపలు, కోళ్లకు మేతగా, కొన్ని రకాల మందుల తయారీలో వినియోగిస్తుంటారు. గోదావరి జిల్లాల నుంచి వ్యాపారులు 70 కిలోల బస్తా దిబ్బగుల్లలకు రూ.500 వంతున చెల్లించి కొనుగోలు చేసి వారే వచ్చి పట్టుకుపోతుంటారు. ఇంటి వద్ద ఉండే మహిళలు, వృద్ధులు, సెలవుల్లో విద్యార్థులు కాలక్షేపానికి వెళ్లినట్టు వెళ్లి రోజుకు నాలుగు బస్తాల వరకు దిబ్బగుల్లలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం గోస్తనీ నదిలోకి తగరపువలస నుంచి డ్రైనేజీలను కలపడం వల్ల ఈ దిబ్బగుల్ల మాంసాన్ని తినడానికి ఎవరూ ఇష్టపడటం లేదు. మిగిలిన అవసరాలకు మాత్రం వీటిని సేకరించి నాలుగు రూపాయలు సంపాదిస్తున్నారు.



సేకరించిన దిబ్బగుల్లలు

గీతం ఆస్పత్రి వద్ద మృతుని బంధువుల ఆందోళన



గీతం ఆస్పత్రి ప్రాంగణంలో ఆందోళన చేస్తున్న సురేష్ భార్య ఝాన్సీ, కుటుంబ సభ్యులు

- వైద్యుల నిర్లక్ష్యంతోనే భర్త చనిపోయాడని భార్య ఆరోపణ

కొమ్మాది : వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త చనిపోయాడంటూ భార్య గీతం ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మధురవాడ స్వతంత్రనగర్‌కు చెందిన పంతం సురేష్ (37) శనివారం ఉదయం ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతుండగా ఆయన భార్య ఝాన్సీ చికిత్స నిమిత్తం రుషికొండలో గల గీతం ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం ఉదయం వరకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. రక్తం తక్కువగా ఉందని ఎక్కించారని, పరిస్థితి విషమంగా ఉందని ఆరోగ్య శ్రీకి దరఖాస్తు చేసుకోమని వైద్యులు సూచించినట్లు ఆమె తెలిపారు. అయితే అన్నీ అయిన తర్వాత ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు సురేష్ చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా జూనియర్ వైద్యులతో వైద్యం అందించారని, కనీసం రక్తం ఎక్కించడం కూడా చేతకాని జూనియర్ వైద్యులతో చికిత్స చేయించడం వల్లే తన భర్త చనిపోయాడంటూ ఝాన్సీ ఆరోపిస్తున్నారు. ఆమెతోపాటు కుటుంబ సభ్యులు ఆస్పత్రి ప్రాంగణంలో ఆందోళనకు దిగారు. ముమ్మాటికీ వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త చనిపోయాడని, ఇప్పుడు మృతదేహాన్ని ఇవ్వమంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆమె ఆరోపించారు. రెండు రోజులపాటు వైద్యం చేస్తున్నట్లు ఇక్కడి డాక్టర్లు హడావిడి చేశారని, ఉదయం నుంచి కోలుకుంటున్న వ్యక్తి... సాయంత్రమయ్యేసరికి ఎలా చనిపోయాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి మృతదేహాన్ని తీసుకెళ్లమని ఆదోళన చేశారు. విషయం తెలుసుకున్న పీఎం పాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.



సంఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పీఎం పాలెం పోలీసులు

క్లుప్తంగా

శిల్పారామంలో ఆకట్టుకున్న కోలాటం ప్రదర్శన



శిల్పారామంలో కోలాటం ప్రదర్శిస్తున్న కళాకారులు

పీఎం పాలెం : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం కోలాటం ప్రదర్శన ప్రేక్షకులను ఆద్యంతం అలరించింది. బొబ్బిలికి చెందిన శ్రీకళాభారతి లక్ష్మీ నరసింహ కోలాటం బృంద కళాకారులు పలు జానపద గేయాలకు చక్కని విన్యాసాలతో కోలాటం ప్రదర్శించి ఆకట్టుకున్నారు. తష్య, రక్షిత, మేఘన, ఆశిష్, కృష్ణ సాయి మృధుల, విష్ణు ప్రియ, రమ్య, గీతాంజలి, కృష్ణవేణి, మహాలక్ష్మి, మౌనిక, జ్యోష్న, హారిక తదితర కళాకారులు పాల్గొనగా జి.తరుణ్ కుమార్ నృత్య దర్శకత్వం వహించారు. స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి పర్యవేక్షించారు.

తీరంలో సందడి



రుషికొండ బీచ్‌లో పర్యాటకులు

కొమ్మాది : అసలే ఆదివారం, ఆపై స్నేహితుల దినోత్సవం కావడంతో పర్యాటక ప్రాంతాలన్నీ యువతీయువకులతో సందడిగా మారాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన సాగర్‌నగర్, రుషికొండ, భీమిలి బీచ్‌లతోపాటు రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, తొట్లకొండ, బావికొండ పర్యాటక ప్రాంతాలన్నీ కళకళలాడాయి. స్నేహితులంతా కలుసుకుని ప్రకృతిని ఆస్వాదిస్తూ చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా సరదాగా గడిపారు.

పాత దుస్తుల సేకరణ



ఎండాడ ప్రాంతంలో పాత దుస్తులు సేకరిస్తున్న ఏఎమ్‌వోహెచ్ కిషోర్

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో ఆదివారం గడప గడపకు వెళ్లి పాత దుస్తులు, పాత వస్తువులు సేకరించారు. ఈ సందర్భంగా ఏఎమ్‌వోహెచ్ కిషోర్ మాట్లాడుతూ సేకరించిన వస్తువులను, దుస్తులను ట్రిపుల్ ఆర్ సెంటర్‌కు తరలించి వాటిని పరిశీలించి అవసరమైన వారికి అందించే కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, సిబ్బంది సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



దుక్కవానిపాలెంలో ప్రచారం చేస్తున్న ప్రతినిధులు

తగరపువలస : త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ ప్రతినిధులు ఆదివారం ఆనందపురం మండలం దుక్కవానిపాలెంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కృష్ణాష్టమి రోజున జరిపే ఊరేగింపు విశిష్టత, ఆధ్యాత్మిక గ్రంథాలపై స్థానికులకు అవగాహన కలిగించారు. దేవుడు మనిషిగా అవతరించి తన అనుచరులకు గీతోపదేశం చేశారని తెలియజేశారు. ప్రచార కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు జి.కృష్ణ, సూరప్పడు, ఎస్.శ్రీనివాస్, డి.పైడన్న, కె.రాజు, కె.సంతోష్, లక్ష్మి, బి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్లాట్‌ఫారం శిథిలం



వెంకటాపురంలో కుళాయి వద్ద శిథిలమైన ప్లాట్ ఫారం

పద్మనాభం : మండలంలోని వెంకటాపురంలో కుళాయి వద్ద ప్లాట్ ఫారం శిథిలమవడంతో నీరు పట్టుకునేందుకు మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న ఈ కుళాయి వద్ద వాడుక నీరు నిల్వ ఉండి పోతోంది. ప్లాట్‌ఫారం శిథిలమవడంతో మహిళలు నీటిలో నిల్చుని నీరు పట్టుకోవాల్సి వస్తోంది. కుళాయి వద్ద నిల్వ ఉన్న నీరు కొద్ది రోజులకు మురికి కూపంగా మారిపోతోంది. అధికారులు స్పందించి కుళాయి వద్ద ప్లాట్‌ఫారం నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం



సినీ గీతాలకు స్టెప్పులు వేస్తున్న జాతర వాకర్స్ అసోసియేషన్ సీనియర్ సిటిజన్స్

పీఎం పాలెం : ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా శిల్పారామంలో ఆదివారం ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. జాతర వాకర్స్ అసోసియేషన్ సభ్యులు చేయి చేయి కలిపి ప్రపంచ ఫ్రెండ్‌షిప్ డేను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్నేహం గొప్పతనం తెలియజేసే హిందీ, తెలుగు సినిమాల్లోని గీతాలను ఆలపించారు. ఆ గీతాలకు నృత్యం చేస్తూ మరింత జోష్ నింపారు. స్నేహ మేరా జీవితం... అంటూ వయసును కాస్తా పక్కన పెట్టి ఉత్సాహంగా స్టెప్పులు వేశారు. మహిళా వాకర్స్ కూడా ఉత్సాహంగా నృత్యం చేసి ఆకట్టుకున్నారు. షటిల్ క్రీడాకారులు కూడా పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



ప్రైవేట్ రిసార్ట్స్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

తగరపువలస : జీవీఎంసీ 3వ వార్డు పండిట్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన 2008 - 2009 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రైవేట్ రిసార్ట్స్‌లో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో భాగంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని ఆనాటి జ్ఞాపకాలను, ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. తమ బ్యాచ్‌లో ఆర్థికంగా వెనుకబడిన స్నేహితులను ఆదుకోవాలని, సేవా కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించుకున్నారు.

భీమిలి రోడ్డుపైకి ముళ్లపొదలు



మరడపాలెం వద్ద తగరపువలస - భీమిలి రోడ్డుపైకి వాలిన ముళ్లపొదలు

తగరపువలస : భీమిలి రోడ్డు పైకి పలుచోట్ల ఇరువైపులా ముళ్లపొదలు, తుప్పలు రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చీకటి పడిన తర్వాత వాహనాల రాకపోకల సమయంలో ఈ తుప్పల కారణంగా లైటింగ్ సరిగా ప్రసరించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆటోలపై వెళ్లేవారికి రహదారికి ఇరువైపులా ఉన్న తుమ్మచెట్ల ముళ్లు గుచ్చుకుంటున్నాయి. నడిచి వెళ్లేవారు కూడా రోడ్లపైకి విస్తరించిన పొదల కారణంగా ఇబ్బంది పడుతున్నారు. వీటిని ఆశ్రయించి విష పురుగులు పొంచి ఉంటున్నాయి. గల్లీ రోడ్డు నుంచి బ్యాంకు కాలనీ వరకు రెండు కిలోమీటర్ల మేర ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతమంతా రేఖవానిపాలెం పంచాయతీ పరిధిలో ఉన్నందున స్థానిక పాలకవర్గం పొదలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే రోడ్లపైకి విస్తరించిన చెట్ల కొమ్మలను కూడా కట్ చేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సీతంపేట: విశాఖ నగర ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గ్రేటర్ విశాఖపట్నం సిటిజన్స్ ఫోరం(జీవీసీఎఫ్) ప్రతినిధులు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంస్థ అధ్యక్షుడు ఎ.కె.సుబ్బారావు మాట్లాడుతూ విశాఖ ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను గుర్తించామన్నారు. ముఖ్యంగా వాయు, జల, శబ్ద కాలుష్యం, పచ్చదనం పునరుద్ధరణ, మడ అడవులతో కూడిన పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ, తీరప్రాంత క్రమబద్ధీకరణ, మురుగునీటి శుద్ధి సామర్థ్యం పెంపు, వర్షపు నీటి నిర్వహణ, ప్లాస్టిక్ కాలుష్య నివారణ, సహజ నీటి వనరుల రక్షణ, పౌరుల భూమి పరిరక్షణ, ట్రాఫిక్ సమస్య, ప్రజా రవాణా మెరుగుదల, వయోవృద్ధులు, దివ్యాంగులకు సౌకర్యాల కల్పన, వారసత్వ సంపద పరిరక్షణ, మురికివాడల్లో జీవితాన్ని మెరుగుపర్చడం, నగరాభివృద్ధికి తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. ప్రజల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ టి.వి.నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ సోహన్ హటంగడి పాల్గొన్నారు.

ఆకతాయిలకు అడ్డా



ఆకతాయిలకు ఆవాసంగా మారిన సంతపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రాంగణం



చీకటి పడితే ఈ పార్కు స్థలమే మందుబాబులకు స్థావరం


- సంతపేట చిల్డ్రన్స్ పార్కు పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు సంతపేట చిల్డ్రన్స్ పార్కు పరిసరాలు ఆకతాయిలకు అడ్డాగా మారిపోయాయి. ఈ పార్కు ఆవరణలో ఒక ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, జిమ్ ఉన్నాయి. వీటికి జీవీఎంసీ రక్షణ కల్పించలేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులు ఈ ప్రాంతాన్ని తమ సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. 2005లో పార్కుకు నిర్మించిన ప్రహరీ ఉన్నా ఆగ్నేయంలో శిథిలం కావడం, ఈశాన్యంలో గేటు ఏర్పాటు చేయకపోవడంతో బయటి వ్యక్తులు ఇక్కడ తిష్ట వేస్తున్నారు. స్కూల్, అంగన్‌వాడీ కేంద్రం పని వేళల్లోనే అల్లరి చిల్లరిగా తిరిగే కొందరు యువకులు పార్కు ప్రదేశంలో సిమెంట్ బెంచీలపై తిష్ట వేసి అటువైపు వచ్చే మహిళలపై రుబాబు చేస్తున్నారు. ఇక చీకటి పడితే స్కూల్, పార్కు ప్రాంగణంలో మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించడం, పాఠశాల ఆస్తులకు నష్టం కలిగించడం వంటి దుష్ట కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. అంతేకాకుండా పవిత్రమైన ఈ ప్రదేశంలోనే మద్యం మత్తులో మల మూత్రాల విసర్జన చేస్తున్నారు. దీంతో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, ఉపాధ్యాయులు అసహ్యించుకుంటున్నారు. అలాగే ఈ పార్కుకు ఆనుకుని ఇటీవల ప్రారంభించిన రైతుబజారులో కార్యకలాపాలు ప్రారంభించకపోవడంతో ఆకతాయిలు అక్కడ కూడా పగలు, రాత్రి తేడా లేకుండా తిష్ట వేస్తున్నారు. ఇటీవల ఇక్కడి ఆదర్శనగర్ గొల్లవీధి ప్రాంతంలో గంజాయి మత్తులో ఉన్న ఐదుగురు యువకులు అశోక్ అనే యువకుడిపై దాడి చేసిన ఘటన ఈ ప్రాంతంలో కలకలం రేపింది. ప్రశాంతతకు మారుపేరుగా ఉండే ఈ ప్రాంతంలో వరుసగా ఆకతాయిలు అలజడులు సృష్టించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో అద్దెకు నివసిస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థులు, దివీస్‌లో పనిచేసే బ్యాచిలర్ ఉద్యోగులు పార్కు, రైతు బజారులలో తిష్ట వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. భీమిలి పోలీసులు నిఘా పెట్టి ఆకతాయిల ఆటలు కట్టించాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా జాతీయ స్థాయి కరాటే పోటీలు

పెదగంట్యాడ: అమరపిని యాన్సెంట్ షాటో కాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీసీ రోడ్డులోని అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన 3వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో 9 రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున క్రీడాకారులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఆంధ్ర షాటో కాన్ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా తెలంగాణకు చెందిన డ్రాగన్ షాటో కాన్ కరాటే దూ స్పోర్ట్స్ ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు కరణంరెడ్డి నర్సింగరావు బహుమతులు అందజేశారు. పోటీలను మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ప్రారంభించారు.

'ఉదయ కిరణాలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాబివర్ధన్

సీతంపేట: రచయిత డాక్టర్ మీగడ శశిభూషణ స్వామి ఆటవెలదిలో అద్భుతమైన పదజాలంతో రచించిన ఉదయకిరణాలు శతకం ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమని ఏయూ జర్నలిజం పూర్వ విభాగాధిపతి ఆచార్య పి.బాబివర్ధన్ అన్నారు. ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. భాషను, భావాన్ని సమన్వయం చేసుకుంటూ, సమాజాన్ని, మానవీయ కోణాన్ని తన రచనలో ఆవిష్కరించారన్నారు. సుమతీ శతకం, వేమన శతకంలా శశిభూషణ స్వామి రాసిన ఉదయకిరణాలు శతకం మంచి పేరును సంపాదిస్తుందని ఆకాంక్షించారు. సీనియర్ జర్నలిస్ట్ నాగబోయిన నాగేశ్వరరావు పుస్తక సమీక్ష చేశారు. సమాజంలోని ప్రతి అంశాన్ని తీసుకుని పద్య రూపంలో పొందుపర్చారన్నారు. కార్యక్రమంలో పుస్తక రచయిత శశిభూషణ స్వామి, సైకాలజిస్ట్ డాక్టర్ జి.రాజేశ్వరరావు, రచయిత పి.చంద్రభూషణం, పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లో శత వసంతాల వేడుకలు



ఫ్రెండ్‌షిప్ డే కేక్ కట్ చేస్తున్న పూర్వ విద్యార్థులు

భీమునిపట్నం : భీమిలిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శత వసంతాల వేడుకలు డిసెంబర్ నెలలో నిర్వహించనున్నామని పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం పాఠశాల వద్ద పూర్వ విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 13, 14, 15న మూడు రోజుల పాటు ఈ వేడుకలు నిర్వహించనున్నామని తెలిపారు. వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న ఈ పాఠశాలకు ఎంతో ఘన చరిత్ర ఉందని, ఇక్కడ చదివిన ఎందరో దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో వున్నారని... వారందరినీ ఆహ్వానిస్తున్నామన్నారు. కమిటీ ఉపాధ్యక్షుడు మైలిపల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని, నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు అప్పలనాయుడు లక్ష రూపాయలు, ముఖ్య సభ్యులు చౌదరి సత్యరాజు రూ.20 వేలు, ఎం.పార్వతీశం, రాజేటి బసవ కృష్ణమూర్తి రూ.10 వేలు చొప్పున విరాళాలు ప్రకటించారు. అనంతరం ఫ్రెండ్‌షిప్ డే కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. సభ్యులు పూసర్ల శ్రీనివాస్, టి.భీమారావు, మీసాల మహీధర్, ముమ్మిడిశెట్టి సత్యానందం, చిన సూర్యనారాయణ పాల్గొన్నారు.

స్వామి భక్తి అంటే ఇదే..!

టీడీపీ హోర్డింగ్‌లకు అసంపూర్తి పరదాలు



కార్ షెడ్ జంక్షన్ వద్ద అసంపూర్తిగా కప్పిన పరదా

మధురవాడ : జీవీఎంసీ అధికారులు అధికార పార్టీ నాయకుల సేవలో తరిస్తూ స్వామి భక్తి ప్రదర్శిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా టీడీపీకి చెందిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు తొలగించ లేదు. కనీసం సచివాలయాలు, ప్రధాన జంక్షన్లలో ఏర్పాటు చేసినవి కూడా తొలగించే ప్రయత్నమూ చేయలేదు. కనీసం విగ్రహాలకు మాస్కులు కూడా వేయని వైనంపై ఎన్నికల కోడ్ అమలు చేయమంతే..! శీర్షికతో సాక్షిలో ఆదివారం ఓ కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు తూతూ మంత్రంగా కోడ్ అమలుకు సిద్ధమయ్యారు. హోర్డింగ్‌లపై ఉన్న యాడ్ పూర్తిగా కప్పేందుకు చేతులు రాకపోవడంతో తూతూ మంత్రంగా కప్పి స్వామి భక్తి ప్రదర్శిస్తున్నారు. కనీసం ఎన్నికల సంఘమైనా తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు.

కాలువల్లో మురుగు నిల్వతో దుర్వాసన



కురపల్లిలో మురుగుతో నిండిన కాలువ

పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపల్లిలో కాలువలన్నీ మురుగునీటితో నిండిపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రక్షిత మంచి నీటి పథకం సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న కాలువలు చెత్త, వ్యర్థాలు, మురుగుతో నిండిపోయాయి. దీనివల్ల దోమలు వృద్ధి చెందడంతో ప్రజలకు రాత్రి వేళల్లో కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చిన్నపాటి వర్షానికే కాలువల్లోని మురుగునీరు పొంగి ప్రవహించడంతో డయేరియా, మలేరియా వంటి వ్యాధుల ప్రబలే ప్రమాదముందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కాలువల్లోని మురుగు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆసియన్ బాక్సింగ్ సెలక్షన్ ట్రయల్స్‌కు దీపిక

ఉక్కునగరం: ఆసియన్ బాక్సింగ్ సెలక్షన్ ట్రయల్స్‌కు స్టీల్‌ప్లాంట్ విద్యార్థిని కనక దీపిక ఎంపికయ్యారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 10 వరకు అబుదాబీలోని ఎ1 ఏఈఎస్ సిటీలో ఏఎస్‌బీసీ ఆసియన్ జూనియర్ బాలురు, బాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో అర్హత కోసం బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 11 వరకు రోహతక్‌లోని సాయ్‌లో సెలక్షన్ ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. జాతీయ డీఏవీ బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో రాష్ట్రస్థాయిలో బంగారు పతకం, సీబీఎస్ఈ సౌత్ జోన్ పోటీల్లో కాంస్యపతకం సాధించిన కనక దీపికను ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ సెలక్షన్ ట్రయల్స్‌కు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆదివారం దీపికను స్టీల్‌ప్లాంట్ బాక్సింగ్ కోచ్ కె.శ్రీనివాసరావు అభినందించారు. దీపిక తండ్రి కె.వెంకటరామారావు స్టీల్‌ప్లాంట్‌లో చార్జిమెన్‌గా తల్లి భవాని న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు.